సాక్షి వనపర్తి


బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



పాడి రైతుల పాట్లు

బిల్లులు సకాలంలో అందక పాడి రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వివరాలు 8లో ▸



తెరుచుకున్న సైఫాన్లు

ఎగువ నుంచి వరద రావడంతో సరళాసాగర్ సైఫాన్లు మరోమారు తెరుచుకున్నాయి.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.0 /21.8

రోజంతా ఎండ తీవ్రత మోస్తరుగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

ప్రాజెక్టులపై నజర్

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పనుల్లో కదలిక



భీమా ఎత్తిపోతల పథకం కింద చేపట్టిన శంకరసముద్రం రిజర్వాయర్

- గట్టు, భీమా ఎత్తిపోతలను పూర్తిస్థాయిలో వినియోగానికి చర్యలు
- నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర, జూపల్లి పర్యటన
- సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. కృష్ణానదిపై ఉన్న గట్టు, భీమా ఎత్తిపోతల పథకాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవడంతో పాటు కీలకమైన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పెండింగ్ పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు సన్నాహాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా బుధవారం రాష్ట్ర సాగునీటి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, ఉమ్మడి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను సందర్శించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలసి ప్రాజెక్టుల పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో తెలుసుకోనున్నారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రుల పర్యటన నేపథ్యంలో సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ పనుల పురోగతిపై ఆశలు నెలకొన్నాయి.

వివిధ దశల్లో 'పాలమూరు' ప్రాజెక్ట్ పనులు..

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ కింద చేపట్టిన పనులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటివరకు నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన, ఉదండాపూర్ రిజర్వాయర్ల నిర్మాణం పూర్తికావచ్చింది. అయితే పంపుహౌజ్‌ల్లో మోటార్ల బిగింపు, ఎలక్ట్రికల్, మెకానికల్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నార్లాపూర్ వద్ద తొమ్మిది మోటార్లను బిగించాల్సి ఉండగా, వీటిలో నాలుగు మోటార్లను బిగించారు. వీటిలో ఒక మోటారు ద్వారా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నీటి ఎత్తిపోతలను ప్రారంభించారు. మిగతా మోటార్ల బిగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఏదులలో పంప్ హౌజ్‌లో పది మోటార్లకు ఐదు, వట్టెంలో పదికి గానూ నాలుగు మోటార్ల బిగింపు పూర్తయింది. మరో మోటారు బిగింపు ప్రక్రియ కొనసాగుతుండగానే ఇటీవల వట్టెం పంప్ హౌజ్‌లోని మోటార్లు వరదనీటిలో మునిగిపోయాయి. వీటి పరిస్థితి ఏంటన్నది తేలాల్సి ఉంది. నార్లాపూర్ నుంచి ఏదుల వరకు పూర్తిస్థాయిలో మెయిన్ కెనాల్, టన్నెల్ పనులను పూర్తిచేయాల్సి ఉంది. కొల్లాపూర్ మండలం కుడికిళ్ల సమీపంలో మెయిన్ కెనాల్ కాల్వ పనులకు భూసేకరణ పూర్తికావడంతో పెండింగ్ పనులకు మార్గం సుగమమైంది. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటన నేపథ్యంలో ప్రాజెక్టుల ప్రస్తుత పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు అవసరమైన వ్యయాన్ని అంచనా వేసి సీఎం రేవంత్‌రెడ్డికి నివేదికను అందిస్తారు.

మంత్రుల పర్యటన షెడ్యూల్ ఇలా..

బుధవారం ఉదయం 7.20 గంటలకు హైదరాబాద్ నుంచి ముగ్గురు మంత్రులు హెలికాప్టర్‌లో బయలుదేరి 9 గంటలకల్లా జడ్చర్ల సమీపంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ వద్దకు చేరుకుని ప్రాజెక్ట్ పనులను పరిశీలిస్తారు.

- 10.30 గంటలకు జోగుళాంబ గద్వాల జిల్లాలోని నల్లసోమనాద్రి గట్టు రిజర్వాయర్‌కు చేరుకుని ప్రాజెక్ట్‌ను సందర్శిస్తారు. 12 గంటలకు వనపర్తి జిల్లాలో భీమా ఎత్తిపోతల పథకం కింద చేపట్టిన శంకరసముద్రం రిజర్వాయర్ పనుల పురోగతిని పరిశీలిస్తారు.
- మధ్యాహ్నం 2.30 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని నార్లాపూర్ రిజర్వాయర్ వద్దకు చేరుకుని పెండింగ్ పనులను తెలుసుకోనున్నారు. అక్కడి నుంచి 4.15 గంటలకు బిజినేపల్లి మండలం వట్టెం పంప్ హౌజ్‌కు చేరుకుని మోటార్ల పరిస్థితి, పనుల పురోగతిని పరిశీలిస్తారు. అనంతరం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఇంజినీరింగ్ అధికారులతో కలసి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించనున్నారు. సాయంత్రం 6 గంటలకు హెలికాప్టర్ ద్వారా తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరనున్నారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో ఉదండాపూర్, వనపర్తి జిల్లా కొత్తకోట, గట్టు ఎత్తిపోతల వద్ద, నార్లాపూర్ రిజర్వాయర్, నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ప్రాంగణంలో హెలీప్యాడ్‌ల కోసం ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు.

అంతర్రాష్ట్ర ప్రాజెక్టుగా
గట్టు ఎత్తిపోతలు



గట్టు ఎత్తిపోతల పథకం వద్ద కొనసాగుతున్న పనులు

- 1.32 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు విస్తరణ
- రూ.2 వేల కోట్లతో అంచనా వ్యయం

గద్వాల: ఉమ్మడి పాలమూరులో కృష్ణానది ప్రవహిస్తున్నప్పటికీ ఎండాకాలంలో తాగు, సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. అయితే కృష్ణానదిపై నిర్మించిన జూరాల ప్రాజెక్టుకు కేటాయింపులు చేసిన 17 టీఎంసీల నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేపోవడంతో చెంతనే కృష్ణమ్మ ప్రవహిస్తున్నా నీటి కష్టాలు తీరడం లేదు. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సాగు, తాగునీరు అవసరాలకు ఇబ్బందులు తొలగించేలా 1.32 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న గట్టు ఎత్తిపోతల పథకం నీటినిల్వ సామర్థ్యం 15 టీఎంసీలకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తుంది. ఈ ప్రాజెక్టు మన రాష్ట్రంతో పాటు పైనున్న కర్ణాటకకు సైతం ఉపయోగపడేలా నిర్మించాలనే యోచనలో ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్చలు జరపడంతో ఈ ప్రాజెక్టుకు సానుకూల స్పందన వస్తోంది. ఈ నేపథ్యంలోనే సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గట్టు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించనుండడంతో ప్రాధాన్యత ఏర్పడింది.

32 వేల ఎకరాలకు సాగునీరు

గట్టు ఎత్తిపోతల పథకం ద్వారా గట్టు, కేటీదొడ్డి మండలాల్లోని 32 వేల ఎకరాల బీడు భూములకు సాగునీటిని అందించాలనే సంకల్పంతో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.558 కోట్ల వ్యయంతో 1.32 టీఎంసీల సామర్థ్యంతో పథకాన్ని చేపట్టారు. నెట్టెంపాడు ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన ర్యాలంపాడు జలాశయం నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా గట్టు ఎత్తిపోతలకు వరదల సమయంలో నీటిని ఎత్తిపోసేలా పథకాన్ని రూపొందించారు. రెండేళ్ల కిందట మొదలైన ఈ ప్రాజెక్టులో సుమారు 25 శాతం పనులు పూర్తి కాగా మిగతావి పురోగతిలో ఉన్నాయి. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఈ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యాన్ని 1.32 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచేలా అధికారులు అంచనాలు రూపొందించారు. ఇందుకోసం సుమారు రూ.2 వేల కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ 15 టీఎంసీల నీటిని నేరుగా జూరాల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా తరలించేందుకు డిజైన్ చేశారు. కృష్ణానదికి వరదల సమయంలో జూరాల బ్యాక్‌వాటర్ నుంచి 15 టీఎంసీల నీటిని ఎత్తిపోసి.. తిరిగి జూరాలకు నీరు అవసరమైన సమయంలో పంపింగ్ చేసేలా పథకం రూపొందించారు. తద్వారా ఈ ప్రాజెక్టుతోపాటు దీనిపై ఆధారపడి ఉన్న నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు, తాగునీటి ఇబ్బందులు తొలగించేలా పథకం రూపొందించనున్నారు.

కర్ణాటకలో లక్ష ఎకరాలు..

గట్టు ఎత్తిపోతల పథకం నీటి నిల్వ సామర్థ్యం పెంచడం వల్ల మన రాష్ట్రంతో పాటు కర్ణాటకలోని రాయచూరు జిల్లాలో లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, మరో 40 గ్రామాలకు తాగునీరు అందిస్తామని కర్ణాటక ప్రభుత్వం వద్ద ప్రతిపాదించారు. ఇందులో భాగంగానే కర్ణాటక రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి బోస్‌రాజు, సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో భేటీ అయి.. ఈ మేరకు చర్చలు జరపడంతో ప్రాజెక్టు అంచనాలు పెంచేందుకు తొలి అడుగు పడినట్లే అని సాగునీటి రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే కర్ణాటక రాష్ట్రం ఆల్మట్టి ఎత్తును పెంచేలా సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో గట్టు ఎత్తిపోతల పథకం నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

న్యూస్‌రీల్

28న లోక్ అదాలత్

వనపర్తి టౌన్: జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో ఈ నెల 28న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని.. సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ కుదుర్చుకోగలిగే క్రిమినల్, సివిల్, చిన్న చిన్న కుటుంబ తగాదాలు, రోడ్డు ప్రమాదాలు, ఇతర కేసులను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

మాది చేతల ప్రభుత్వం : ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



అమరచింత: ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పక్కా ప్రణాళికతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు నాగల్‌కడ్మూర్‌లో రాయితీ గ్యాస్ సిలిండర్ల ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అభివృద్ధి పేరుతో గత ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. నాలాలు, చెరువులను ఆక్రమించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని.. హైడ్రా తన పని తాను చూసుకుంటుందని, పేదలకు అన్యాయం జరగకుండా తమ ప్రభుత్వం కాపాడుతుందనే విషయాన్ని ప్రజలు గుర్తించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ..

గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలను నియంత్రించే అవకాశం ఉందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో ప్రజలు రూ.2.30లతో ఏర్పాటు చేసుకున్న 16 సీసీ కెమెరాలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్, డీసీసీ ప్రధానకార్యదర్శి అయ్యూబ్‌ఖాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి, సీఐ శివకుమార్, ఎస్‌ఐ సురేష్, జగదీశ్వర్‌రెడ్డి, మహ్మద్ కౌసర్, బీరప్ప, వెంకటేశ్వర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారుల గుర్తింపు



వనపర్తిటౌన్: ఎన్‌సీఈఆర్టీ రూపొందించిన ప్రశస్త్ యాప్ ద్వారా స్కానింగ్ చేసి ప్రత్యేక అవసరాల విద్యార్థులను గుర్తించవచ్చని.. ప్రతి విద్యార్థినీ స్కాన్ చేయాలని జిల్లా సమ్మిళిత విద్య సమన్వయకర్త యుగంధర్ సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జీవశాస్త్ర స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించడం ద్వారా ఎక్కువ సమయం వృథా కాదన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీవశాస్త్రం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భారీ కొండచిలువ పట్టివేత



వనపర్తి: జిల్లా కేంద్రంలోని నాగవరం శివారు వాసవీ కల్యాణ మండపం సమీపంలో ఉన్న ముళ్లపొదల్లో కొండ చిలువ ఉందని స్థానిక ఏఆర్ కానిస్టేబుల్ ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం అర్ధరాత్రి పట్టుకున్నట్లు సాగర్ స్నేక్స్ సొసైటీ నిర్వాహకుడు కృష్ణసాగర్ తెలిపారు. మంగళవారం కొండ చిలువను ఫారెస్టు అధికారులకు అప్పగించారు. భారీ వర్షాలకు ప్రాజెక్టుల్లో నుంచి వచ్చే వరద నీటిలో మొసళ్లు, కొండ చిలువలు నది పరీవాహక ప్రాంతాలు, చెరువులకు వచ్చే అవకాశం ఉందని కృష్ణసాగర్ తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సూపరింటెండెంట్ ప్రభాకర్‌రావు, సెక్షన్ అధికారులు బాలకిష్టమ్మ, రాణి రామచందర్, చందు, శ్రీను పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు సర్వే

కలెక్టర్ ఆదర్శ్ సురభి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్, ఆర్డీఓ

వనపర్తి: రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించేందుకు పకడ్బందీగా ఓటరు సర్వే (స్పెషల్ సమ్మరీ రివిజన్) నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.నగేష్ పాల్గొని జిల్లా వివరాలు వెల్లడించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ లేవల్ అధికారి ఉండాలని, ఇంటింటి సర్వే నిర్వహించడంతో పాటు కొత్త ఓటర్లతో ఫారం–6 తీసుకోవడం, మరణించిన, శాశ్వతంగా తరలిపోయిన వారి వివరాలు ఫారం–8, 7లో తీసుకోవాలని సూచించారు. బూత్ లేవల్ సూపర్‌వైజర్లు, ఏఈఆర్‌ఓలు పక్కాగా పర్యవేక్షణ చేయాలని.. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ కోసం ఈఆర్‌ఓ నెట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కొత్త ఓటర్ల ఎపిక్ కార్డుల ప్రింటింగ్ నిమిత్తం వివరాలు ఎప్పటికప్పుడు పంపించాలని.. మరణించిన, శాశ్వతంగా తరలిపోయిన వారి పేర్లు జాబితా నుంచి తొలగించే ప్రక్రియ వేగవంతం చేయాలని ఆర్డీఓను ఆదేశించారు. తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయడంపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ పద్మావతి, ఈ–సెక్షన్ సూపరింటెండెంట్ కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి సహకారం

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



చైర్మన్, వైస్ చైర్మన్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న స్వరణ్‌సింగ్.. చిత్రంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి రూరల్: పెబ్బేరు వ్యవసాయ మార్కెట్‌యార్డు అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్లతో స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్‌గా గౌని ప్రమోదిని, వైస్ చైర్మన్‌గా ఎద్దుల విజవర్ధన్‌రెడ్డి, సభ్యులుగా ఆంజనేయులు, బత్తుల కవిత, రామన్‌గౌడ్, సయ్యద్ షాహిన్‌బేగం, రామకోటి, కృష్ణయ్య, నర్సింహనాయుడు, శంకర్, కాత్రవత వెంకటేష్‌నాయక్, మోతె రాముడు, ఆర్.చంద్రకళ, ఇటుకూరి బిచ్చయ్య, జగన్నాథనాయుడుతో జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి స్వరణ్‌సింగ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. పెబ్బేరు సంత పెద్దదని ఈ స్థలం ఎవరూ కబ్జా చేయకుండా ఫెన్సింగ్ చేయిస్తానని హామీ ఇచ్చారు. రైతు రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు లేదని, రూ.లక్ష రుణమాఫీ చేస్తామని విడతల వారీగా అన్నదాలను ఎన్నో ఇబ్బందులకు గురిచేసిన ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ అని విమర్శించారు. అక్టోబర్ 2 నుంచి రాష్ట్రంలోని ప్రజలందరికి డిజిటల్ రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ, వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ నాయకులు అక్కి శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌గౌడ్, వెంకట్రాములు, వెంకటేష్‌సాగర్, దయాకర్‌రెడ్డి, రంజికుమార్, పాండేశ్వర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీహరిరాజు, బీరం రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో జాగ్రత్తలు తప్పనిసరి

మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి



మాట్లాడుతున్న ఈఈ మేఘారెడ్డి

కొత్తకోట రూరల్: గ్రామీణ ప్రాంతాలకు సరఫరా చేసే నీరు నాణ్యతగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం కొత్తకోట ఎంపీడీఓ కార్యాలయంలోని ప్రొ. జయశంకర్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రామపంచాయతీ వాటర్‌మెన్ల శిక్షణకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బోర్లు, పంప్‌సెట్ల నిర్వహణ తదితర వాటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నాలుగు రోజుల పాటు శిక్షణ కొనసాగుతోందని.. మొదటిరోజు నీటి వృథాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు, రెండోరోజు బోర్లు, పంపుసెట్ల నిర్వహణ, మూడోరోజు చేతిపంపుల మరమ్మతు, నాలుగోరోజు పైప్ లీకేజీల మరమ్మతుపై శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, గ్రామాల్లో నీటిఎద్దడి తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఈ జైపాల్‌రెడ్డి, ఏఈ శివానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, ల్యాబ్ టెక్నీషియన్లు అంజన్న, మహేష్, అశోక్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి క్రికెట్ జట్టు ఎంపిక

వనపర్తిటౌన్: జిల్లాస్థాయి అండర్–14 బాలుర క్రికెట్ జట్టు ఎంపికను గురువారం జిల్లాకేంద్రంలోని బాలుర క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ సెక్రటరీ జి.సురేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఒరిజినల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతో ఉదయం 9 గంటలకు గ్రౌండ్‌లో హాజరుకావాలని పేర్కొన్నారు. 2011, జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులని సూచించారు. పూర్తి వివరాలకు పీడీ శ్రీనివాసులు 94415 65805, కోచ్ రాంబాబు 73861 10914 సంప్రదించాలని పేర్కొన్నారు.

గ్యారంటీ లేని పథకాలతో కాలయాపన

- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



అమరచింత సభ్యత్వ నమోదులో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

అమరచింత/ఆత్మకూర్: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు ప్రజలకు జవాబు చెప్పలేని స్థితిలో ఉన్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. మంగళవారం అమరచింత, ఆత్మకూర్‌లో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పంట రుణమాఫీ అంతా బూటకమని.. రుణాలు మాఫీగాక రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు కల్లబొల్లి మాటాలు చెప్పి కాంగ్రెస్‌పార్టీ మోసం చేసిందని.. ఆరు హామీలను నేటికీ పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బూత్ లేవల్‌లో కనీసం 100 మందితో సభ్యత్వాలు చేయించేలా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగిన పార్టీ బీజేపీ అని.. పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. బూత్ లేవల్ బాధ్యులు సెల్‌నంబర్ 88000 02024కు డయల్‌చేసి సభ్యత్వాలు నమోదు చేయించాలని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సభ్యత్వాలు పెంచుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరించాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. అమరచింతలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కొండన్న, బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు మరాఠి అశోక్, మేర్వ రాజు, క్యామ భాస్కర్, నరాల నారాయణ, ఎస్.వెంకటేశ్వర్లు, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి, సిద్ధి రాములు, హరీశ్, మల్లారెడ్డి, ఆత్మకూర్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీను, అనీల్‌గౌడ్, అశ్విన్‌కుమార్, మహేశ్వరి, తమ్మలి విజయ్, విష్ణువర్ధన్‌రెడ్డి, సోమశేఖర్‌గౌడ్, ఎల్లన్న, అంజి, బాలకృష్ణ పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి : డీఎంహెచ్‌ఓ



ఆరోగ్య విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. శ్రీనివాసులు

పాన్‌గల్: విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలబారిన పడకుండా ఉండవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం, ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పరిసరాలు, నీటి ట్యాంకులు, తరగతి గదులను పరిశీలించారు. నీటి నిల్వలు, దోమల వృద్ధితో రోగాలు వస్తాయని.. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్య విద్య, వ్యక్తిగత శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తరగతి గదుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు డా. చంద్రశేఖర్, ఏఎంఓ కుమారస్వామి, సీహెచ్‌ఓ శ్రీనివాస్‌జీ, జిల్లా ఏఎల్‌ఓ బృందం సభ్యులు సతీష్‌కుమార్, గంధం రాజు, సాయన్న, శాంతిభూషణ్, శ్రీనివాస్, వైద్య సిబ్బంది, ఎస్‌ఓ హేమలత, హాస్టల్ వార్డెన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య


శ్రీనివాసులు (ఫైల్)

ఆత్మకూర్: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆత్మకూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై నరేందర్ తెలిపిన ప్రకారం.. ఆత్మకూర్‌లోని తెలుగు వీధికి చెందిన ఆకుల శ్రీనివాసులు(46)కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో విరక్తి చెందిన ఆయన సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.మంగళవారం కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలున్నారు.

యువకుడి బలవన్మరణం


పూసల సాయి (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాకేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జిల్లాకేంద్రానికి చెందిన పూసల సాయి (25) అంబేడ్కర్ చౌరస్తాలో చిరు వ్యాపారం చేసుకొంటూ జీవనం సాగించేవాడు. మంగళవారం తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా గుర్తించిన కుటుంబసభ్యులు మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. సాయి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ గోవర్ధన్‌ను వివరించారు.

రైలు ఢీకొని 40 గొర్రెలు మృతి

మానవపాడు: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని 40 గొర్రెలు మృతిచెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మానవపాడుకు ఓ వ్యక్తి దాదాపు 60 గొర్రెలను పెంచుతున్నాడు. ప్రమాదవశాత్తు మానవపాడు శివారులోనే రైలు పట్టాలపైకి గొర్రెలు వెళ్లగా.. వేగంగా వచ్చిన రైలు ఢీకొనడంతో 40 గొర్రెలు మృతిచెందాయని స్థానికులు తెలిపారు.

ఆలయంలో చోరీ.. కేసు నమోదు

గద్వాల క్రైం: పట్టణంలోని వీరభద్ర స్వామి దేవాలయంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. కమిటీ నిర్వాహకులు, పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ కథనం మేరకు.. దేవాలయంలోని హుండీని ధ్వంసం చేసి అందుల్లో ఉన్న డబ్బును అపహరించారు. విలువైన బంగారు ఆభరణాలు లేకపోవడంతో ఆలయ కమిటీ నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. కమిటీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కాగా..ఆలయంలో వరుసగా ఇది నాలుగోసారి చోరీ జరగడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జరిగిన సంఘటనలపై పోలీసులు ఇప్పటి వరకు ఛేదించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

పాడి రైతుల పాట్లు


గండేడ్‌లోని విజయ డెయిరీ

- సకాలంలో అందని బిల్లులు
- స్పందించని అధికారులు
- నిర్వహణ భారమవుతోందని ఆందోళన

గండేడ్: సకాలంలో బిల్లులు అందక పాడి రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో విజయ డెయిరీకి 250 వరకు పాల సేకరణ కేంద్రాలు ఉండగా.. సుమారు మూడు వేల మంది రైతులు నిత్యం 40 వేలకుపైగా లీటర్ల పాలు విక్రయిస్తున్నారు. సేకరించిన పాలను చిల్లింగ్ చేయడానికిగాను గండేడ్‌లో ఎంసీసీ(మిల్క్ చిల్లింగ్ సెంటర్), మహబూబ్‌నగర్, మిడ్జిల్, జడ్చర్ల, పెద్ద ఆగిరాలపల్లిలో బీఎంసీ(బల్క్ మిల్క్ చిల్లింగ్ సెంటర్) ఉన్నాయి. పెరిగిన పాల ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకొని గండేడ్‌లో రూర్బన్ పథకం కింద రూ.2.75 కోట్లు వెచ్చించి 5 వేల కేఎల్ సామర్థ్యంతో 2023, జూన్ 28న విజయ డెయిరీని ఏర్పాటు చేశారు. దీని పరిధిలో నాలుగు రూట్లు ఉండగా.. ఉమ్మడి జిల్లా పరిధిలోని హన్వాడ, గండేడ్, మహమ్మదాబాద్, కొడంగల్, దౌల్తాబాద్, గుండుమాల్, దామరగిద్ద, కోస్గి, మద్దూరుతో పాటు వికారాబాద్ జిల్లా దోమ, కొత్తపల్లి 11 మండలాల్లో 39 పాలసేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 900 మంది వరకు రైతులు నిత్యం పాలు పోస్తుండగా.. 4,500 కేఎల్ నుంచి ఐదు వేల కేఎల్ గండేడ్ చిల్లింగ్ కేంద్రానికి వస్తున్నాయి.

అధిక ధర చెల్లిస్తుండటంతో..

ఇతర ప్రైవేట్ డెయిరీల కంటే విజయ డెయిరీలో పాల ధర అధికంగా ఉండటంతో రైతులు ఈ కేంద్రాల్లోనే విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇతర డెయిరీల్లో ఆవు పాలకు ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ ఆధారంగా రూ.38 వరకు చెల్లిస్తుండగా.. విజయ డెయిరీలో రూ.40 నుంచి రూ.48 వరకు ఉంది. గేదె పాలు అయితే ప్రైవేట్‌లో రూ.80.. విజయాలో రూ.90 వరకు ఇస్తున్నారు.

సకాలంలో బిల్లులు అందక..

ప్రైవేట్ డెయిరీలో 10 రోజులకు ఒకసారి.. విజయ డెయిరీలో 15 రోజులకు ఒకసారి బిల్లులు చెల్లిస్తారు. కానీ 2 నెలల 15 రోజులు గడుస్తున్నా బిల్లులు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 250 కేంద్రాల్లో సుమారు రూ.10 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని రాజాపూర్, మిడ్జిల్, బాలానగర్, జడ్చర్ల మండలాల రైతులు సుమారు 480 మందికి రెండు నెలలుగా బిల్లులు అందలేదు. రూ.3 కోట్ల వరకు బకాయి ఉండటంతో విసిగి వేసారిన రైతులు ఈ నెల 12న రోడ్డుపై పాలు పారబోసి జడ్చర్ల విజయ డెయిరీకి తాళం వేశారు. సిగ్నల్‌గడ్డ వద్ద ఆందోళనకు దిగారు. పాడినే నమ్ముకున్న రైతులు దిక్కుతోచక విలవిలాడుతున్నారు.


హన్వాడ కేంద్రంలో పాలు పోస్తున్న రైతులు

ఇబ్బందులు పడుతున్నాం..



నాకు ఆరు ఆవులు, ఒక బర్రె ఉంది. రోజు 32 లీటర్ల పాలు విక్రయిస్తాను. బిల్లు 15 రోజులకు ఓసారి ఇవ్వాల్సి ఉండగా.. జులై నుంచి ఇప్పటి వరకు రాలేదు. అడిగితే ఈ రోజు రేపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అప్పు చేసి దాణా, మందులు కొనుగోలు చేయాల్సి వస్తుంది. నెల నెలా అవసరాలకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది.

– దోమ పురుషోత్తంరెడ్డి, పాడి రైతు, రెడ్డిపల్లి

రూ.5 లక్షలు రావాలి..



ఏడాదిగా పాలకేంద్రం నిర్వహిస్తున్నా. నిత్యం 16 మంది రైతులు 160 లీటర్ల పాలు పోసేవారు. రెండు సెంటర్లు ఉన్నాయని నా సెంటర్‌ను నెల కింద తీసేశారు. నా సెంటర్‌కు నాలుగు బిల్లులు రూ.5 లక్షలు రావాలి. రైతులు ఒత్తిడి చేయడంతో రూ.3.50 లక్షలు అప్పు తెచ్చి కొంత మేర ఇచ్చా. ఉన్నతాధికారులకు కూడా ఈ విషయం విన్నవించా. అయినా ఇంకా ఇవ్వడం లేదు.

– కె..నర్సిములు, పాల కేంద్రం నిర్వాహకుడు, హన్వాడ

వారంలో చెల్లిస్తాం..

విజయ డెయిరీలో ప్రైవేట్ కంటే ధర అధికంగా ఉంది. రైతులు గేదె పాలు స్థానికంగా విక్రయించి ఆవు పాలే ఎక్కువగా పోస్తున్నారు. వీటిని పట్టణ వాసులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో మార్కెటింగ్ సమస్య తలెత్తి బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం నాలుగు బిల్లులు చెల్లించాల్సి ఉంది. జడ్చర్ల రైతుల బిల్లులు చెల్లించాం. మిగతా వారికి వారంలో చెల్లిస్తాం.

– కవిత, డీడీ, విజయ డెయిరీ, మహబూబ్‌నగర్ జిల్లా

మన్యంకొండలో అగ్నిగుండ ఉత్సవం


అలంకరణలో వీరభద్రస్వామి


మన్యంకొండలో అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో ఉన్న వీరభద్రస్వామి అగ్నిగుండం కార్యక్రమం మంగళవారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. దేవస్థానం వద్ద జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి సంకీర్తనలను ఆలపిస్తూ నందికోళ్ల సేవ చేపట్టారు.అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహంతో దేవస్థానం నుంచి సమీపంలో ఉన్న కోనేరు వద్దకు వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరిగి స్వామివారిని కోనేరు నుంచి దేవస్థానం ముందున్న అగ్నిగుండం ప్రాంతానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించి తడిబట్టలతో దేవస్థానం ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండం ప్రాంతానికి చేరుకున్నారు. పూజలు చేసిన అనంతరం నిప్పులపై నడిచి భక్తి చాటుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారితో పాటు అర్చకులు పాల్గొన్నారు.

మెడికల్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మెడికోలు

పాలమూరు: ఎస్వీఎస్ మెడికల్ కళాశాలలో నిర్వహిస్తున్న మెడికల్ ఎక్స్‌పో–2024 వైద్య విజ్ఞాన ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన రావడంతో.. మరో రెండురోజుల పాటు పొడిగించారు. మంగళవారం కొత్తగా ఆరు విభాగాలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేసి వచ్చిన విద్యార్థులకు మెడికోలు అవగాహన కల్పించారు. ఉమ్మడి జిల్లా నుంచి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతో పాటు ప్రైవేట్ స్కూల్స్, కళాశాలల నుంచి భారీగా విద్యార్థులు హాజరై ఎగ్జిబిషన్ తిలకిస్తున్నారు. ప్రధానంగా వైద్య ఎగ్జిబిషన్‌లో వైద్యంలో ప్రధాన అంశాలతో పాటు మానవ శరీర భాగాల గురించి క్షుణ్ణంగా తెలియచెబుతున్న నేపథ్యంలో ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తరలించడానికి ప్రత్యేక వాహనాలు కేటాయించి తీసుకు వస్తున్నారు. ఎగ్జిబిషన్‌కు వచ్చిన విద్యార్థులకు భోజనం, తాగునీరు వంటి వసతులు కల్పించారు.


బురదమయంగా జోగ్యతండా ప్రాథమిక పాఠశాల ఆవరణ, తరగతి గది

బడిలో ముప్పు... కలిగేనా కనువిప్పు?

వర్షం వస్తే చాలు ఆ పాఠశాల తరగతి గది, ఆవరణ అనే తేడా లేకుండా బురదమయమవుతోంది. దీనికితోడు పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి.. పై కప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది అచ్చంపేట మండలంలోని ఏజెన్సీ గ్రామమైన జోగ్యతండా ప్రాథమిక పాఠశాల. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రాథమిక పాఠశాల తరగతి గదుల్లోకి వర్షపు నీరు చేరి తరగతి గదులు బురదమయంగా మారాయి. దీంతో గత్యంతరం లేక పాఠశాలకు ఉన్న సింగిల్ టీచర్ సుజాత విద్యార్థులను ఇళ్లకు పంపింది. వర్షాకాలంలో పరిస్థితి ఇలాగే ఉంటుందని, ప్రమాదం జరగకముందే ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈఓ శంకర్‌నాయక్ స్పందిస్తూ నూతన భవనం కోసం ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

– అచ్చంపేట రూరల్

బోరు ఆన్ చేసేందుకు వెళ్లి..

చెరువులో వాటర్‌మేన్ గల్లంతు


గల్లంతైన జంగయ్య

జడ్చర్ల: చెరువులో ఉన్న తాగునీటి బోరు ఆన్ చేసేందుకు వెళ్లి వాటర్ మేన్ గల్లంతయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని గోప్లాపూర్ గ్రామానికి చెందిన తోకల జంగయ్య(68) 20 ఏళ్లుగా గ్రామ పంచాయతీ వాటర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అయితే మూడు రోజులుగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామ శివారులోని చెరువులో ఉన్న బోర్లను వినియోగిస్తున్నారు. ప్రతిరోజు అక్కడికి వెళ్లి బోరు మోటార్లు ఆన్ చేసి గ్రామానికి తాగునీటి సరఫరా కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి చెరువులో ఉన్న మోటార్లు ఆన్ చేయడానికి వెళ్లగా.. గుంతలలో ప్రమదవశాత్తు పడి గల్లంతయ్యాడు. మంగళవారం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు గమనించి అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెళ్లి చెరువులో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. జంగయ్యకు భార్య నర్సమ్మ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి..

నవాబుపేట: చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కొందుర్గు మండలం తంగడిపల్లి గ్రామానికి చెందిన చెక్కల ఆంజనేయులు(38) మరో ఇద్దరితో కలిసి సోమవారం మండలంలోని గురుకుంట గ్రామ శివారు మేకల కుంటలో చేపలు పట్టేందుకు వెళ్లారు. కాగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఆంజనేయులు మృతిచెందాడు. మంగళవారం చెరువులో గాలించగా ఆంజనేయులు మృతదేహం లభించింది. ఈ ఘటనపై ఆంజనేయులు భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

ఎస్‌బీఐ ఉద్యోగికి రిమాండ్

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎస్‌బీఐలో విధులు నిర్వర్తించిన సీనియర్ అసోసియేట్ భూమిరెడ్డి కిరణ్ కుమార్‌ను మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాము తెలిపారు. ఖాతాదారుల అకౌంట్ల నుంచి సొంత ప్రయోజనాలకు డబ్బులు వాడుకున్నట్లు నిర్ధారణ కావడంతో అచ్చంపేట సివిల్ కోర్టు జడ్జి రిమాండ్ విధించగా జైలుకు పంపినట్లు తెలిపారు. 2018 నుంచి 2023 సంవత్సరం వరకు ఇలా ఖాతాల నుంచి మోసపూరితంగా డబ్బులను ఇతర ఖాతాలకు మళ్లించాడని ఎస్ఐ అన్నారు. సుమారు రూ. 1కోటి 49 లక్షల 50 వేలు విత్ డ్రా చేశాడని వివరించారు. వాటిని అతడి భార్య ప్రశాంతి, అలాగే అదే బ్రాంచ్ లో ఉన్న వివిధ అకౌంట్లోకి బదిలీ చేసి స్వప్రయోజనాలకు వాడుకున్నాడని తేలిందన్నారు. బ్రాంచ్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశామన్నారు. మంగళవారం సీఐ రవీందర్ జడ్జి ముందు హాజరు పర్చగా... పూర్వాపరాలు విచారించి 14 రోజుల పాటు రిమాండ్ విధించారని వివరించారు.

విద్యార్థి మృతిపై ఆందోళన


స్కూల్ వద్ద విద్యార్థి మృతదేహంతో ఆందోళన చేపట్టిన కుటుంబ సభ్యులు

గద్వాల క్రైం: ప్రైవేటు పాఠశాలలో నర్సరీ చదువుతున్న విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. విద్యార్థి మృతికి పాఠశాల యాజమాన్యమే కారణమని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. గద్వాల మండలం పూడూర్ గ్రామానికి చెందిన యశ్వంత్ (5) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నర్సరీ చదువుతున్నాడు. నాలుగు రోజులుగా విద్యార్థి జ్వరంతో బాధపడుతున్న క్రమంలో తల్లిదండ్రులు చికిత్స చేయించారు. మంగళవారం జ్వరం తగ్గడంతో స్కూల్‌కు పంపించి.. జ్వరానికి సంబంధించిన మందులను పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ క్రమంలో మధ్యాహ్నం విద్యార్థికి జ్వరం రావడంతో తల్లిదండ్రులు ఇచ్చిన మందులను వేసిన కొంత సమయానికే విద్యార్థికి ఫిట్స్ రావడంతో యాజమాన్యం స్కూల్ బస్సులో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ విద్యార్థి యశ్వంత్ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గోపి, పల్లవి అక్కడికి చేరుకుని కన్నీటి పర్యాంతమయ్యారు. మధ్యాహ్నం జ్వరం వచ్చిన విషయాన్ని ముందుగానే తల్లిదండ్రులకు స్కూల్ యాజమాన్యం చెప్పకపోవడం.. ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి తమ కుమారుడి మృతికి కారకులయ్యారని తల్లిదండ్రులు ఆరోపించారు. జ్వరం మళ్లీ వచ్చిన విషయాన్ని తమకు తెలియజేసి ఉంటే మెరుగైన చికిత్స చేయించేవారమని ఆగ్రహించారు. విద్యార్థి మృతికి యాజమాన్యమే కారణమంటూ రాత్రి 9 గంటల సమయంలో విద్యార్థి మృతదేహంతో పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఏబీవీపీ నాయకులు వారికి మద్దతు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు పాఠశాలకు చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదని భీష్మించి కూర్చున్నారు. ఈ ఘటనపై స్కూల్ యాజమాన్యాన్ని 'సాక్షి' వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.

వెల లేని వెయ్యి నోట్లు

- రూ.లక్ష విలువైన వెయ్యి నోట్లను దాచిన వృద్ధురాలు


రూ.వెయ్యి నోట్లు


రూ.వెయ్యి నోట్ల కట్టతో వృద్ధురాలు కర్రెమ్మ

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): 'అదృష్టం బాలేనప్పుడు అరటి పండు తిన్నా పన్ను విరుగుద్ది' అన్నట్లుంది నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వెల్గొండ గ్రామానికి చెందిన ఏడుదులపల్లి కర్రెమ్మ పరిస్థితి. అక్షరాల లక్ష రూపాయలు దాచామని సంతోషించాలో.. ఆ (రూ.వెయ్యి) నోట్లకు ఇప్పుడు విలువ లేదని తెలిసి బాధపడాలో అర్థం కావడం లేదని వాపోయింది. కేంద్ర ప్రభుత్వం 2016 నవంబర్ 8న రూ.వెయ్యి, రూ.500 నోట్లను రద్దు చేసింది. కరెమ్మ భర్త కొండయ్య కొంత భూమి కౌలు తీసుకుని పత్తి పంట సాగు చేశాడు. ఆ పంటను అమ్మగా రూ.లక్ష వచ్చాయి. ఆ డబ్బులకు మరిన్ని కలిపి ఇల్లు నిర్మించుకోవాలనుకుని, వాటిని ఎవరికీ తెలియకుండా ఇంట్లోనే జాగ్రత్తగా దాచిపెట్టి మరిచిపోయాడు. రెండేళ్ల క్రితం కొండయ్య చనిపోయాడు. ఈ క్రమంలో కర్రెమ్మ ఇంటిని సర్దుతుండగా రూ.వెయ్యి నోట్ల కట్ట కనిపించింది. ఇంతలోనే వాటికి విలువ లేదని తెలిసి కృంగిపోయింది. బ్యాంకులు స్పందించి తమ కష్టార్జితాన్ని మార్చి నగదు ఇవ్వాలని బాధితురాలు వేడుకుంటుంది.

ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ జట్ల ఎంపిక


ఫుట్‌బాల్ ఆడుతున్న బాలికలు

జడ్చర్ల టౌన్: ఎస్‌జీఎఫ్ అండర్ 14, అండర్ 17 బాల, బాలికల జిల్లా జట్లను మంగళవారం బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఎంపిక చేశారు. ఆయా విభాగాల్లో ప్రతిభ ఆధారంగా 18 మంది చొప్పున ఎంపికయ్యారు. కాగా జట్ల ఎంపిక కోసం నిర్వహించిన టోర్నీలో మొత్తం 205 మంది పాల్గొన్నారు. పోటీలను ఎంఈఓ మంజులాదేవి ప్రారంభించారు. హైస్కూల్ హెచ్ఎం చంద్రకళ, టోర్నమెంట్ కన్వీనర్లు పీడీ వడన్న, రామ్‌కల్యాణ్, రామకృష్ణ, రాజశేఖర్, స్కూల్‌గేమ్స్ కార్యదర్శి డా.శారదబాయి పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 27 నుంచి గద్వాలలో జరిగే ఉమ్మడిజిల్లా టోర్నీలో పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు మండల టోర్నీ..: ఎస్‌జీఎఫ్ మండలస్థాయి అండర్ 14, అండర్ 17 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు బుధవారం బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ పీడీ రాంకల్యాణ్, పీడీ వడెన్న తెలియజేశారు.

జోగుళాంబ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


డీజీపీ జితేందర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈఓ పురేందర్, అర్చకుడు ఆనంద్‌శర్మ

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు డీజీపీ జితేందర్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు దేవస్థానం ఈఓ పురేందర్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ మంగళవారం హైదరాబాద్‌లో డీజీపీని కలిసి ఆహ్వాన పత్రికతో పాటు ప్రసాదం అందజేశారు. అక్టోబర్ 7వ తేదీ ఆలయాన్ని దర్శిస్తానని డీజీపీ తెలిపారు. అలాగే అడిషనల్ డీజీపీ మహేష్‌భగవత్, ఐజీ ఎం.రమేష్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాంను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

సిట్‌.. బాబు స్కిట్‌

లడ్డూ వివాదంపై సిట్‌ ఇన్‌చార్జ్‌గా అత్యంత వివాదాస్పద ఐపీఎస్‌ అధికారి త్రిపాఠి

చంద్రబాబు అనుకూల వాదనకు బలం చేకూర్చడమే లక్ష్యంగా ఏర్పాటు

సాక్షి, అమరావతి : అనుకున్నంతా అయ్యింది.. తిరుమల లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు మరో కుట్రకు తెరతీశారు. లడ్డూ ప్రసాదం వివాదంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్‌) విచారణ పేరిట తిమ్మిని బమ్మిని చేసే కుతంత్రానికి తెరతీశారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశంపై సిట్టింగ్‌ జడ్జితో విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీతోపాటు పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్‌ను బేఖాతరు చేస్తూ.. తాము చెప్పినట్టుగా దర్యాప్తును ప్రభావితం చేయాలన్న లక్ష్యంతోనే సిట్‌ను నియమించారు. తానే కర్త, కర్మ, క్రియగా మారి తిరుమల లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేసిన చంద్రబాబు.. ఆ కుట్రను కప్పిపుచ్చడమే లక్ష్యంగా ఈ సిట్‌ను ఏర్పాటు చేసినట్టు స్పష్టమవుతోంది. ఎందుకంటే అవాస్తవ ఆరోపణలతో తిరుమల పవిత్రతను టీడీపీ కూటమి ప్రభుత్వం దెబ్బ తీసిందన్నది బట్టబయలైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చేసిన ఏ ఆరోపణకు కూడా ఆధారం చూపించలేకపోయారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసినట్టు ఎన్‌డీడీబీ నివేదికలో ఎక్కడా పేర్కొనలేదన్నది స్పష్టమైంది. ఇక కర్ణాటక సహకార పాడి రైతుల సమాఖ్య డెయిరీ (నందిని నెయ్యి)కి ఎందుకు కాంట్రాక్టు ఇవ్వలేదని నిలదీసేందుకు చంద్రబాబు వేసిన ఎత్తుగడ బెడిసికొట్టింది. ఎందుకంటే 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వమే తొలిసారిగా నందిని డెయిరీకి కాంట్రాక్టు ఇవ్వకుండా మహారాష్ట్రలోని ప్రైవేటు డెయిరీకి కాంట్రాక్టు కట్టబెట్టిందన్నది వెల్లడైంది. జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి విపరీతమైన దుర్వాసన వస్తుందని ఆహార శాస్త్రవేత్తలు సైతం స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో తిరుమల లడ్డూ ప్రసాదంపై అటువంటి ఫిర్యాదులు రాని విషయాన్ని గుర్తు చేశారు. అన్నింటికంటే ప్రధానంగా.. నెయ్యి కల్తీ జరిగినట్టు నివేదిక వస్తే టీడీపీ ప్రభుత్వం ఆహార భద్రతా చట్టం కింద కేసు ఎందుకు నమోదు చేయాలేదని నిపుణుల ప్రశ్నకు చంద్రబాబు ప్రభుత్వం



ఎన్నికల్లో టీడీపీ అక్రమాలకు వత్తాసు పలికిన త్రిపాఠి తీరుపై 'కూటమి సేవలో ఘనాపాఠి' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనం

ఖంగుతింది. దాంతో రాజకీయ ప్రయోజనాల కోసం తిరుమల లడ్డూ ప్రసాదానికి కళంకం ఆపాదించే కుట్ర పన్నారని సర్వత్రా ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. లడ్డూ ప్రసాదం అంశంపై నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించాలని దేశ వ్యాప్తంగా డిమాండ్‌ వ్యక్తమవుతోంది. మరోవైపు టీడీపీ దుష్ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ సమర్థవంతంగా తిప్పికొట్టింది. లడ్డూ ప్రసాదం అంశంపై హైకోర్టుగానీ సుప్రీంకోర్టు సిట్టింగ్‌ న్యాయమూర్తితోగానీ విచారణ జరిపించాలని డిమాండ్‌ చేసింది. రాజ్యసభ మాజీ సభ్యుడు, తిరుమల వ్యవహారాలపై సాధికారికత ఉన్న సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టులో పిటిషన్‌ వేశారు. లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు వ్యాఖ్యలపై విచారించాలని కోరారు. దేశ వ్యాప్తంగా హిందూ సంస్థలు, రిటైర్డ్‌ బ్యూరోక్రాట్లు కూడా ఈ అంశంపై నిష్పక్షపాతంగా విచారించాలని డిమాండ్‌ చేస్తున్నారు. దాంతో చంద్రబాబు బెంబేలెత్తారు. సిట్టింగ్‌ న్యాయమూర్తి ద్వారానో మరో దర్యాప్తు సంస్థ ద్వారానో విచారణ నిర్వహిస్తే తమ కుట్ర బట్టబయలవుతుందని ఆందోళన చెందారు. ఎందుకంటే చంద్రబాబు చేసిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సిట్టింగ్‌ న్యాయమూర్తిగానీ ఇతర దర్యాప్తు సంస్థకు గానీ సమర్పించాలి. కానీ రాజకీయ ప్రయోజనాల కోసం లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేసిన చంద్రబాబు ఎటువంటి ఆధారాలు చూపించ లేరు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉండేట్టుగా.. తాను చెప్పింది చేసేలా సిట్‌ ఏర్పాటు చేశారు.

సిట్‌ ఇన్‌చార్జ్‌గా వివాదాస్పద అధికారి

అత్యంత వివాదాస్పద అధికారి, ఇటీవల ఎన్నికల్లో టీడీపీ కూటమి అక్రమాలకు కొమ్ము కాశారని ఆరోపణలు ఎదుర్కొన్న గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని సిట్‌ ఇన్‌చార్జ్‌గా నియమించడం పట్ల సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ బృందంలో విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్‌ జెట్టీ, కడప ఎస్పీ హర్షవర్ధన్‌ రాజులను సభ్యులుగా నియమించారు. కాగా, ఎన్నికల్లో అక్రమాలకు చంద్రబాబు, దగ్గుబాటి పురందేశ్వరి పక్కా పన్నాగంతో వ్యవహరించి రాష్ట్రంలో కీలక స్థానాల్లో ఉన్న పోలీసు అధికారులపై దుష్ప్రచారం చేశారు. ఎవరెవర్ని బదిలీ చేయాలి.. ఆ స్థానాల్లో ఎవర్ని నియమించాలనే జాబితాను కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు సమర్పించడం గమనార్హం. టీడీపీ కూటమి ఒత్తిడికి లొంగి ఎన్నికల కమిషన్‌ అప్పటి గుంటూరు రేంజ్‌ ఐజీగా ఉన్న పాలరాజును హఠాత్తుగా బదిలీ చేసింది. ఆ స్థానంలో చంద్రబాబు ఆదేశాలతో దగ్గుబాటి పురందేశ్వరి సూచించిన జాబితాలోని సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ఐజీగా నియమించింది. అనంతరం ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ రౌడీమూకలు చెలరేగిపోయి విధ్వంస కాండ సృష్టించడం తెలిసిందే. ప్రధానంగా పల్నాడులో టీడీపీ కూటమి గుండాలు దాడులు, దౌర్జన్యాలతో బెంబేలెత్తించారు. మాచర్లలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై టీడీపీ రౌడీలు దాడులు చేశారు. అప్పటి గురజాల ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాసు మహేశ్‌ రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. గురజాలలో బాంబు దాడులకు పాల్పడ్డారు. పల్నాడు వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఓట్లు వేయకుండా పచ్చ రౌడీలు దాడులతో విధ్వంసం సృష్టించారు. టీడీపీ ఎన్నికల అక్రమాలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ నేతలు ఎంతగా ఫిర్యాదులు చేసినా సరే.. సర్వశ్రేష్ఠ త్రిపాఠి పట్టించుకోలేదు. పోలింగ్‌ రోజున కనీసం ఫోన్లకు కూడా స్పందించలేదు. అదీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి ట్రాక్‌ రికార్డ్‌. అంతటి వివాదాస్పద అధికారిని చంద్రబాబు ప్రస్తుతం తిరుమల లడ్డూ ప్రసాదం అంశంపై ఏర్పాటు చేసిన సిట్‌కు ఇన్‌చార్జ్‌గా నియమించడం గమనార్హం. అంటే ఇక సిట్‌ దర్యాప్తు ఎలా సాగుతుందో.. నివేదిక ఎలా ఉండనుందో ఊహించుకోవచ్చని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

నిబద్ధులైన అధికారులను కాదని..

సిట్‌ ఇన్‌చార్జ్‌గా నియమించేందుకు ఐజీలు వినీత్‌బ్రిజ్‌లాల్‌, పీహెచ్‌డీ రామకృష్ణ, ఆకే రవి కృష్ణల పేర్లను పరిశీలిస్తున్నట్టుగా టీడీపీ కూటమి ప్రభుత్వం మీడియాకు లీకులు ఇచ్చింది. కానీ వినీత్‌ బ్రిజ్‌లాల్‌ నిజాయితీపరుడు, ముక్కుసూటి అధికారిగా గుర్తింపు పొందారు. ఆయన తాము చెప్పినట్టుగా తప్పుడు నివేదిక ఇవ్వరని చంద్రబాబు భావించారు. టీడీపీ కూటమి ప్రభుత్వ అడ్డగోలు వ్యవహార శైలితో విసిగిపోయిన ఆయన డెప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులకు వెళ్లాలని కూడా భావిస్తున్నారు. ఇక పీహెచ్‌డీ రామకృష్ణ కూడా తాము చెప్పినట్టుగా నివేదిక ఇస్తారని చంద్రబాబుకు నమ్మకం లేదు. ఆకే రవికృష్ణ పేరు పరిశీలించారు గానీ పూర్తి నమ్మకం లేకపోవడంతో పక్కన పెట్టేశారు. అందుకే ఇటీవల ఎన్నికల్లో టీడీపీ అక్రమాలకు వత్తాసు పలికిన ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠినే సిట్‌ ఇన్‌చార్జ్‌గా నియమించారు. లడ్డూ ప్రసాదంపై తాము వ్యాప్తిలోకి తెచ్చిన దుష్ప్రచారానికి అధికారిక ముద్ర వేసేలా.. తిరుమల పవిత్రతకు భంగకరంగా నివేదిక ఇచ్చి సర్వభ్రష్టత్వం పట్టించాలన్న చంద్రబాబు పన్నాగంలో భాగంగానే సర్వ శ్రేష్ఠ త్రిపాఠిని సిట్‌ ఇన్‌చార్జ్‌గా నియమించారన్నది స్పష్టమవుతోంది.

హిందువులంతా

ఏకం కావాలి

సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఉపేక్షించను

- నేను పోరాటం చేయాలనుకుంటే ఆపేవారెవరూ లేరు
- హిందువులు కనీసం కోపం తెచ్చుకోకపోతే ఏం చేయగలం
- ప్రకాష్‌రాజ్‌ తెలుసుకుని మాట్లాడాలి
- సెక్యులరిజం వన్‌వే కాదు టూ వే
- అల్లాహ్‌, జీసస్‌పైన మీరు మాట్లాడగలరా?
- ఇంద్రకీలాద్రిపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ వ్యాఖ్యలు

సాక్షి, అమరావతి/ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): సనాతన ధర్మానికి భంగం వాటిల్లితే హిందువులంతా ఏకమై.. కలసికట్టుగా మాట్లాడాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ అన్నారు. సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. హిందువులు మౌనం వహిస్తే, ఆ మౌనం భవిష్యత్తు తరాలను నాశనం చేస్తుందన్నారు. ధర్మాన్ని పరిరక్షించడం గుడికి వెళ్లే ప్రతి హిందూ బాధ్యత కాదా, నా ఒక్కడి బాధ్యతేనా అంటూ ప్రశ్నించారు. 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా మంగళవారం విజయవాడలోని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ శుద్ధి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కనక దుర్గమ్మవారి దర్శనం అనంతరం ఇంద్రకీలాద్రిపై ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సనాతన ధర్మానికి సంబంధించి పోరాటం చేయాలనుకుంటే తనను ఆపేవారు ఎవరూ లేరన్నారు. ధర్మం కోసం పోరాటం చేస్తే చనిపోవడానికి సిద్ధమని, కానీ, అక్కడిదాకా తీసుకెళ్లనని చెప్పారు. సున్నితాంశాలపై నటుడు ప్రకాశ్‌రాజ్‌ విషయం తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. సనాతన ధర్మానికి, పవిత్రతకు భంగం కలిగినప్పుడు మాట్లాడడం కూడా తప్పే అన్నట్లు చెబితే ఎలా..? మాట్లాడేవారు ఒకటికి వందసార్లు ఆలోచించి మాట్లాడండి అని చెప్పారు. సెక్యులరిజం అనేది వన్‌ వే కాదని అది టూ వే అని చెప్పారు. హిందువులు మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడితే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. మసీదులో చిన్నపాటి చోరీ జరిగితే ఇలాగే



మాట్లాడతారా అని అన్నారు. హిందూ దేవుళ్లపైన మాట్లాడే వారు అల్లాహ్‌ పైన, మహ్మద్‌ ప్రవక్తపైన, జీసస్‌పైన మాట్లాడగలరా అంటూ రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. ఇస్లాంపైన మాట్లాడితే ఆ మతం వారు పెద్దఎత్తున బయటకు వస్తారు అంటూ చెప్పారు. హిందువులను రోడ్లపైకి రమ్మని చెప్పడం లేదన్నారు. కనీసం హిందువులకు కోపం రాకపోతే ఏం చేస్తామన్నారు. ఈ సందర్భంగా సినిమా ఇండస్ట్రీ వారికి కూడా విజ్ఞప్తి చేశారు. సనాతన ధర్మంపై ఇష్టానుసారం జోకులు వేయడం, మీమ్స్‌ చేయడం సరికాదన్నారు. ఓ సినిమా ఫంక్షన్‌లో జోకులు వేస్తున్నారని, ఎంతోమంది మనోభావాలతో ముడిపడి ఉన్న అంశాల విషయంలో జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. దేశమంతటికీ కలిపి 'సనాతన ధర్మ రక్షణ బోర్డు'తప్పనిసరి అని చెప్పారు. చిన్నప్పటి నుంచి తాను సనాతన ధర్మం పాటించే వాడినన్నారు. తమ ఇష్టదైవం ఆంజనేయస్వామి అని, తాము రామభక్తులమని చెప్పారు. ఈ సందర్భంగా పొన్నవోలు సుధాకరరెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డిపైన విమర్శలు చేశారు. అంతకుముందు పవన్‌ కళ్యాణ్‌కు ఆలయ అధికారులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయం మెట్లను కడిగి, పసుపు రాశారు.

మహిళలను అడ్డుకున్న సిబ్బంది

ఆలయంలో మెట్లను పవన్‌కళ్యాణ్‌ శుభ్రం చేసే కార్యక్రమానికి అర్ధగంట ముందు, ఆ తర్వాత కూడా మహిళా భక్తులు మెట్ల పూజ చేసుకోకుండా ఆలయ సిబ్బంది అడ్డుకున్నారు. మెట్ల పూజ చేసుకుంటూ వస్తున్న మహిళా భక్తులను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని క్యూలైన్‌లోకి పంపేందుకు ప్రయత్నించారు. దీంతో సెక్యూరిటీ సిబ్బందికి, మహిళా భక్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. మెట్ల పూజ మొక్కు పూర్తి చేసుకోకుండా దర్శనానికి వెళ్లమని చెప్పడం ఎంత వరకు సబబని మహిళలు మండిపడ్డారు.

కొత్త నిబంధనలతో కలవరం!

▶ మొదటి పేజీ తరువాయి

వడ్లను కూడా రాష్ట్రాలు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు. 2022 రబీ సీజన్‌కు సంబంధించిన సుమారు 60 లక్షల మెట్రిక్‌ టన్నుల (ఎల్‌ఎంటీ) ధాన్యాన్ని మిల్లింగ్‌ చేయలేదు. ఇందులో 60% ధాన్యాన్ని విక్రయించుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితుల్లోనే మిల్లింగ్‌కు వచ్చిన ధాన్యాన్ని 75 రోజుల్లోనే తప్పనిసరిగా సీఎంఆర్‌గా అప్పగించాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

సీఎంఆర్‌ పెండింగ్‌ ఉంటే ధాన్యం ఇవ్వరు

పైరవీలతో ఇష్టానుసారంగా ధాన్యాన్ని కేటాయింపజేసుకునే విధానానికి కూడా ఖరీఫ్‌ నుంచే ప్రభుత్వం చెక్‌ పెట్టనుంది. మిల్లు సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యాన్ని కేటాయించాలని నిర్ణయించింది. ఆ మేరకు కచ్చితమైన లెక్కలను నిర్ధారించింది. ఇచ్చిన ధాన్యాన్ని ఒక్కో షిఫ్టుకు 8 గంటల చొప్పున రెండు షిఫ్టుల్లో పనిచేయడం ద్వారా 75 రోజుల్లో కేటాయించిన మొత్తం ధాన్యాన్ని మిల్లింగ్‌ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అప్పటికే రెండు మూడు సీజన్ల సీఎంఆర్‌ పెండింగ్‌ ఉన్నా.. మిల్లర్ల సంఘం నాయకులతో పైరవీలు చేయించుకొని తిరిగి ధాన్యం కేటాయింప జేసుకునే విధానానికి కూడా అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం తన మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొంది. మిల్లుల పని తీరును పర్యవేక్షించే బాధ్యత ఇప్పటివరకు అదనపు కలెక్టర్లకు, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఉండగా, ఇక నుంచి జిల్లా కలెక్టర్లే స్వయంగా పర్యవేక్షించనున్నారు.

బ్యాంకు గ్యారంటీలు, ష్యూరిటీలు తప్పనిసరి

2021- 2022 రబీ సీజన్‌లో మిల్లులకు కేటాయించిన ధాన్యం మిల్లింగ్‌ కాలేదు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత చూస్తే ఆ సీజన్‌కు సంబంధించిన ధాన్యం గానీ, డబ్బులు కానీ లెక్క తేల్లేదు. మిల్లులను తనిఖీలు చేస్తే అక్కడ ధాన్యం లేదు. చాలావరకు ధాన్యం పక్కదారి పట్టింది. రాష్ట్రంలోని 3 వేల మిల్లులకు కేటాయించిన 65 ఎల్‌ఎంటీ ధాన్యంలో సుమారు 30 ఎల్‌ఎంటీ ధాన్యం వివరాలు లేవు. ప్రస్తుతం ఆ ధాన్యాన్ని రికవరీ చేసే పనిలో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో ఇకపై ధాన్యం కేటాయించిన మిల్లుల నుంచి ఆ ధాన్యం విలువలో 25 శాతాన్ని బ్యాంకు గ్యారంటీ రూపంలో తీసుకోవడమే కాకుండా, ఇద్దరు ఆర్థికంగా ఉన్న వ్యక్తుల ష్యూరిటీ, మిల్లర్ల అసోసియేషన్‌ నుంచి అఫిడవిట్‌ రూపంలో హామీ పత్రం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని మిల్లర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం.

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి



పాలమూరు: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్‌ ఎన్నికల్లో పార్టీకి అధిక ఓట్లు వచ్చాయని.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అదే స్థాయిలో ఓట్లు వస్తాయని అనుకోవడం పొరపాటని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌ ధర్మారావు అన్నారు. జిల్లాకేంద్రంలోని కొత్తగంజ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అసెంబ్లీ, పార్లమెంట్‌ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలకు చాలా తేడా ఉంటుందన్నారు. స్థానిక సంస్థల్లో అత్యధిక స్థానాలను గెలుచుకోవాలంటే క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. కులమతాలకు అతీతంగా పార్టీలో చేరే విధంగా చూడాలన్నారు. అత్యధికంగా యువకులు బీజేపీ సభ్యత్వాన్ని తీసుకునే విధంగా కృషి చేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పద్మజారెడ్డి, బాలరాజు, కృష్ణవర్ధన్‌ రెడ్డి, పాండురంగారెడ్డి, రాములు, బుచ్చిరెడ్డి, అంజయ్య, యాదయ్య పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి హ్యుందాయ్‌ అల్కాజర్‌



పాలమూరు: మార్కెట్‌లోకి నూతనంగా వచ్చిన సరికొత్త హ్యుందాయ్‌ అల్కాజర్‌ కారును మంగళవారం షోరూంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూం ఎండీ గట్టు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ హ్యుందాయ్‌ కంపెనీ ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు చేస్తూ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా కొత్త మోడల్స్‌ మార్కెట్‌లోకి తీసుకు వస్తుందన్నారు. ఈ నూతన అల్కాజర్‌ కారు 6/7 సీట్ల సామర్థ్యం కలిగి 73 భద్రత ప్రత్యేకతను కలిగి ఉందన్నారు. పెట్రోల్‌ విభాగంలో 18.66కి.మీ., డీజిల్‌ వెర్షన్‌లో 19.63 కి.మీ.మైలేజ్‌ వస్తుందని, కారు ప్రారంభ ధర రూ.14.99 లక్షల నుంచి లభిస్తుందన్నారు. ఆరు వేరియంట్‌లలో అందుబాటులో ఉందని, లెవెల్‌ 2 మెమొరీ సీట్‌ 8 మైండర్‌తో 360 డిగ్రీల కెమెరా కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌ డైరెక్టర్‌ హర్షిత్‌రెడ్డి, యుక్త మోటార్స్‌ సీఈఓ సిరిచందనరెడ్డి, సేల్స్‌ మేనేజర్‌ వర్షవర్ధన్‌రెడ్డి, వసీమ్‌ పాల్గొన్నారు.

న్యాయం చేయకుండా పనులెలా చేస్తారు?



ప్రభుత్వ అతిథి గృహంలో నిర్వాసితులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులు

- ఉదండాపూర్‌ నిర్వాసితుల ఆందోళన

జడ్చర్ల: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మాం.. విలువైన భూములు అప్పగిస్తే.. తక్కువ పరిహారం ఇచ్చి చేతులు దులుపుకొన్నారు.. దీనిపై అప్పట్లో ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాతో కలిసి ఆందోళన చేశారు. న్యాయమైన పరిహారం ఇచ్చేవిధంగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కానీ, ఇప్పుడు సమస్యలు ఎక్కడివి అక్కడే పెట్టి రిజర్వాయర్‌ పనులు మొదలు పెడుతున్నారు. ఇదెక్కడి న్యాయమంటూ ఉదండాపూర్‌ నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం వల్లూరు, ఉదండాపూర్‌ గ్రామాలకు చెందిన నిర్వాసితులు జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమను పోలీసులు పిలిపించడంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చామని పేర్కొన్నారు. ఏ తప్పు చేయకుండానే పోలీస్‌స్టేషన్‌కు పిలిపించడం ఏమిటని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లకు రూ.వందల కోట్లు విడుదల చేస్తున్నారు.. ఇళ్లు, భూములు పోగొట్టుకున్న మాకేమో మొండిచేయి చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు మొదలుపెట్టి తొమ్మిదేళ్లు గడుస్తున్నా న్యాయం చేయడం లేదని మండిపడ్డారు. పరిహారం అందుకోకుండానే ఎంతోమంది రిజర్వాయర్‌ కోసం తవ్విన గోతుల్లో పడి మృతిచెందారని, ఇప్పటికైనా తమకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు.

మంత్రులతో మాట్లాడిస్తాం..

పోలీస్‌స్టేషన్‌ నుంచి ప్రభుత్వ అతిథి గృహం వద్దకు వెళ్లి సమావేశమైన నిర్వాసితులతో మహబూబ్‌నగర్‌ డీఎస్పీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్‌ బ్రహ్మంగౌడ్‌, సీఐ ఆదిరెడ్డి, ఇరిగేషన్‌ అధికారులు చర్చలు జరిపారు. బుధవారం రిజర్వాయర్‌ను పరిశీలించేందుకు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి దామోదర రాజనర్సింహ వస్తున్నందున ఎలాంటి అడ్డంకులు సృష్టించవద్దని నిర్వాసితులను కోరారు. 12 మందితో కూడిన నిర్వాసితుల బృందాన్ని మంత్రులతో మాట్లాడించేందుకు అనుమతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాగా తమకు న్యాయం చేసిన తర్వాతే పనులు మొదలు పెట్టాలని నిర్వాసితులు తేల్చిచెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ శ్రీనివాసులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవినాయక్‌, నాయకులు హన్మంతు, బాలు, ఐలయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెంచుల అభ్యున్నతికి పాటుపడాలి



మాట్లాడుతున్న కలెక్టర్‌ బదావత్‌ సంతోష్‌


నాగర్‌కర్నూల్‌: జిల్లాలో పీవీటీజీ (పర్టికులర్లీ వల్నరబుల్‌ ట్రైబల్‌ గ్రూప్స్‌)గా గుర్తించబడిన చెంచులకు ప్రధానమంత్రి జన్‌ మన్‌ కార్యక్రమం ద్వారా వసతులు కల్పించాలని కలెక్టర్‌ బదావత్‌ సంతోష్‌ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పీఎం జన్‌ మన్‌ జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌ పథకంపై ఐటీడీఏ ఇన్‌చార్జ్‌ పీఓ రోహిత్‌ గోపిడితో కలిసి ఆయా శాఖల అధికారులతో అంశాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు చెంచుపెంటల్లో జరిగిన పనులు, చేపట్టాల్సిన వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని 8 మండలు, 88 ఆదివాసీ చెంచు పెంటల్లో జీవిస్తున్న 8,772 మంది చెంచులకు ప్రధాన మంత్రి జన్‌ మన్‌ పథకం ద్వారా 11 రకాల మౌలిక వసతులు అందేలా చూడాలన్నారు. చెంచు ప్రజలందరికీ ఆధార్‌ కార్డులను రానున్న వారం రోజుల్లో అందించాలని ఆదేశించారు. చెంచుల నివాస ప్రాంతాల్లో ఇప్పటికే మంజూరైన 890 ఇళ్లు, రోడ్లు వసతి, నివాసాలు, తాగునీటి సరఫరా, మొబైల్‌ మెడికల్‌ యూనిట్లు, అంగన్‌వాడీ సెంటర్లు, అన్ని పెంటల్లో విద్యుత్‌ కనెక్షన్లు పూర్తి చేయాలన్నారు. పథకాలు అందించడంలో ఇబ్బందులు లేకుండా గుర్తింపు కార్డులు అందించేందుకు ప్రత్యేక డ్రైవ్‌ నిర్వహించాలన్నారు. వారంలోగా అందరికీ జనన ధ్రువీకరణ సర్టిఫికెట్లు, ఆధార్‌ కార్డులు, ఆయుష్మాన్‌ భారత్‌, కిసాన్‌ క్రెడిట్‌ కార్డులు అందించాలన్నారు. రాజీవ్‌ ఆరోగ్యశ్రీ అధికారులు ఆయుష్మాన్‌ భారత్‌ కార్డులను సర్వే ఫారంల ఆధారంగా చెంచు సభ్యుల జాబితాను తయారు చేసి అందరికీ జారీ అయ్యేలా చూడాలని వైద్య, ఆరోగ్య శాఖను కలెక్టర్‌ ఆదేశించారు. చెంచులకు ఎవరికైతే బ్యాంకు ఖాతాలు లేవో వారందరికీ జన్‌ ధన్‌ బ్యాంక్‌ అకౌంట్లను ప్రతి ఒక్కరికి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. పట్టా కలిగి ఉన్న కుటుంబ భూ యజమాని మరణిస్తే వారి వారసులకు భూ బదలాయింపు నిరంతర ప్రక్రియగా కొనసాగించాలన్నారు. డీఆర్‌డీఓ చిన్న ఓబులేష్‌, డీపీఓ రాం మోహన్‌రావు, అచ్చంపేట, కొల్లాపూర్‌ ఆర్డీఓలు మాధవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మోటార్లు పాడుకాకుండా చూడండి

- ముఖ్యమంత్రికి మాజీ మంత్రి నాగం లేఖ

నాగర్‌కర్నూల్‌: ఈ నెల 2న కురిసిన భారీ వర్షానికి వెంకటాద్రి రిజర్వాయర్‌ పంప్‌హౌజ్‌లో అమర్చిన మోటార్లు నీట మునిగాయని.. 20 మీటర్ల ఎత్తు వరకు నీరు చేరగా వాటిని తోడకపోవడంతో బురదలో కూరుకుపోయాయని, పాడుకాకుండా చూడాలని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. మంగళవారం ముఖ్యమంత్రికి లేఖ పంపగా అందులో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల సమస్యలు ప్రస్తావించారు. ఉమ్మడి జిల్లాలో పెద్ద ప్రాజెక్టులు చేపట్టినా పూర్తిస్థాయిలో నీటిని వినియోగించుకోలేని పరిస్థితి నెలకొందని.. ఇందుకు కారణం ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు, పంట కాల్వలు లేకపోవడమేనన్నారు. 7 లక్షల ఎకరాలకు నీరందించే పాలమూరు ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీలు త్వరగా పూర్తిచేసి రైతులకు నీరందించాలని కోరారు. కేసీఆర్‌ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరీంనగర్‌, మెదక్‌ జిల్లాల ప్రాజెక్టులకు ప్రాధాన్యమిచ్చి పూర్తిచేసి రైతులకు మేలు చేశారని.. పాలమూరు జిల్లాపై శ్రద్ధ వహించి కృష్ణా జలాలపై ఉన్న హక్కును వినియోగించుకొని ప్రతి ఎకరాకు నీరందించాలని కోరారు. కొత్తగా నిర్మిస్తున్న కొడంగల్‌ లిఫ్ట్‌కు వెంటనే భూ సేకరణ చేపట్టి రైతులు, భూ నిర్వాసితులకు నష్టపరిహారం అందించి పనులు ప్రారంభించాలన్నారు. నిపుణులైన న్యాయవాదులతో కృష్ణా జలాల్లో 69 శాతం ఉన్న తెలంగాణ ప్రజల వాటాను కాపాడాలని కోరారు.

జూరాలకు పెరిగిన వరద



జూరాల వద్ద మూడు క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు


- మూడు క్రస్టు గేట్ల ఎత్తివేత
- 11 యూనిట్లలో విద్యుదుత్పత్తి

ధరూరు/ఆత్మకూరు/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రం 17వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మంగళవారం సాయంత్రానికి 51 వేల క్యూసెక్కులకు పెరిగినట్లు పేర్కొన్నారు. దీంతో మూడు క్రస్టు గేట్లను ఎత్తి గేట్ల ద్వారా 21,714 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జెన్‌కో జల విద్యుత్‌ కేంద్రంలో 11 యూనిట్లను కొనసాగించి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ఇందుకోసం 37,176 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. ఆవిరి రూపంలో 96 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 920 క్యూసెక్కులు, కుడి కాల్వకు 720 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్‌ లింక్‌ కెనాల్‌కు 50 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 61,276 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.542 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ, దిగువ జలవిద్యుత్‌ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 354.200 మిలియన్‌ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని ఎస్‌ఈలు సురేష్‌, సూరిబాబు తెలిపారు.

■ శ్రీశైలం జలాశయంలో మంగళవారం నీటిమట్టం 874.8 అడుగుల వద్ద 162.4372 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి కలిపి 65,429 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. ఎడమ గట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 29,119 మొత్తం 64,434 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 17,083 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,460, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 733 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో 14.125 మిలియన్‌ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 3.457 మి.యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

రామన్‌పాడు నుంచి 7 వేల క్యూసెక్కులు..

రామన్‌పాడు జలాశయానికి సరళాసాగర్‌ నుంచి వరద వస్తుండడంతో ఒక గేటు ఎత్తి 7వేల క్యూసెక్కుల నీటిని దిగకు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉంది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 920 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 721 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఎన్టీఆర్‌ కాల్వ ద్వారా 1,150 క్యూసెక్కులు కుడి, ఎడమ కాల్వ ద్వారా 20 క్యూసెక్కులు, వివిధ లిఫ్టుల ద్వారా 858 క్యూసెక్కులు తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రసీల్‌రెడ్డి తెలిపారు.



తెరుచుకున్న సరళాసాగర్‌ సైఫాన్లు

తెరుచుకున్న సరళాసాగర్‌ సైఫాన్లు

మదనాపురం: సరళాసాగర్‌ జలాశయం సైఫాన్లు ఈ సీజన్‌లో రెండోసారి మంగళవారం సాయంత్రం తెరుచుకున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి వరద రావడంతో రెండు వుడ్‌ సైఫాన్లు, ఒకటి ప్రైమరీ సైఫన్‌ తెరుకుంది. రెండు వుడ్‌ సైఫాన్ల ద్వారా 6,400 క్యూసెక్కులు, ప్రైమరీ సైఫాన్‌ ద్వారా 500 క్యూసెక్కులు మొత్తం 6,900 క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతుందని ఏఈ సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు.